జై శ్రీమన్నారాయణ

<u>గీతాజ్యోతి ఉద్దేశాలు:</u>

ప్రజలందరి సమగ్ర చైతన్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రూపొందించిన కార్యక్రమము "గీతాజ్యోతి". కులం పేరుతో, పార్టీ పేరుతో, మతం పేరుతో సంఘ మర్యాద పేరుతో, ఈనాటి మన దేశ జనాభాను రాజకీయనేతలెందరో చిన్నాభిన్నం చేసివేస్తున్నారు.

వేదాల సారాన్ని, అర్జునుడిని సాకుగా పెట్టుకుని, స్వామి, మానవ సమాజం కోసం ఉదారంగా అందించాడు. విశ్వాసంతో, వాడుకోగలిగితే కులమతభేదం లేక మనలందరినీ మంచి మనుష్యులుగా తీర్చిదిద్దే మహోత్కృష్టమైన గ్రంధరాజం "భగవద్గీత". శ్రీ రామాయణం, భారతం, భగవద్గీత హిందూ గ్రంధాలనటం తగదు. ప్రపంచంలోని మానవజాతికంతటికీ మార్గనిర్దేసం చేసే మహోన్నతమైన పవిత్ర గ్రంధాలు ఇవి. వాటిల్లోని అంతస్సందేశాలను ఆకలింపు చేసుకుంటే మనుష్యలక్షణంగా చెప్పిన ఆచరణ మనకీ అలవడుతుంది. మనమూ మంచి మనుష్యులం కాగలుగుతాం. చీలికలుగా విడిపడుతున్న మన తోడి మానవ సమాజాన్ని చిత్రమైన వస్త్రంగా ఒకటి చేసి ప్రకాసింపచేయగలుగుతాం! ఈ లక్ష్యంతో రూపుదిద్దిన కార్యక్రమమే గీతాజ్యోతి.

ఇందులో 5 అంశాలున్నాయి.

1. మన ఆలోచనా ధోరణిలో మార్పురావాలి.
2. నిర్లిప్త, నిర్లక్ష్య వైఖరులు తొలగి మనలో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందాలి.
3. పొరుగు వానితో కలిసినపుడు పంచుకోడానికొక పవిత్ర సందేశం కావాలి.
4. మన ప్రాంతాలలో ధార్మిక చైతన్యాన్ని సజీవంగా ఉంచగలిగే వ్యవస్థను నిర్మించుకోవాలి.
5. అవసరమైన సేవా కార్యక్రమాలు కొన్నియైన మన ప్రాంతాలలో చేసుకోగలగాలి.

ఈ మానవజాతి శ్రేయస్సు దృష్ట్యా గీతాజ్యోతి రెండు సూత్రాలని తయారు చేసింది.

1. స్వీయ ఆరాధన- సర్వ ఆదరణ.
2. మాధవ సేవగా సర్వప్రాణి సేవ.

నా మతాన్ని ఆరాధిస్తాను. నీ మతాన్ని ఆదరిస్తాను. అన్నీ ఒకటే అంటూ అర్థంలేని ఏకతా వాక్యాలు వల్లె వేయకు. ఇద్దరం కలిసి సమాజ శ్రేయస్సనే మతానికై పరిశ్రమిద్దాం! ఇది అర్థం కావడం తక్షణ కర్తవ్యం. ఇది అన్ని మతాల వారికి తెలియవలసి ఉంది. మనల్ని పరిపాలించే రాజకీయ నేతలకు మరీ ముఖ్యంగా తెలియవలసి ఉంది. ఈ దిశలో ఆలోచనా ధోరణి మారవలసిన అవసరం. ఈ మానవ జాతి శ్రేయస్సు దృష్ట్యా తక్షణం జరగాలి.

అందుకే " స్వీయ ఆరాధణ - సర్వ ఆదరణ" మనం అలవరుచుకోవాలి.

అలాగే సర్వప్రాణులలో మాధవుడున్నాడని కదా వేదాలు చెపుతున్నాయి! అలాంటప్పుడు ఏ ప్రాణికి సేవజేసిన, అది ఆవైనా, గేదైనా, పక్షి అయినా వృక్షం అయినా అందులోని మాదవుడు దానిని అందుకొంటాడు. ఆనందించి అనుగ్రహిస్తాడు కూడా.

అందుకే 'మానవ సేవయే' అనే దానిని పురష్కరించుకొని సర్వ ప్రాణులకు చేసే సేవను మాధవుని సేవ గానే భావించాలనేది మనకందరకు అవగాహన కావాలి. ఆ దిశగా మానవ జీవితం కదలాలి. వారానికో సందేశం శ్రీకృష్ణుని ఉపదేశమైన భగవద్గీత లోంచి గ్రహిద్దాం. మనవారందరితో పంచుకొందాం. ప్రతీ శ్లోకమూ ఓ సందేశమే అయినా మన వసతి,శక్తి, అవకాసాన్ని అనుసరించి వారానికొకటి నిర్ణయించుకొందాం. ఏడాదికి 48 శ్లోకాలు అవుతాయి.వాటిలో సందేశాలను గ్రహిద్దాం! వాటిని ఇంట ఇంట అందించి అందరితో అనుసంధిద్దాం.

మన గ్రామాన్ని గీతాజ్యోతి గ్రామంగా తీర్చి దిద్దుదాం. ఈ భూమి మీద పరస్పరం కలహాలు మాని కలసి జీవిద్దాం. సమాజానికి మనం సేవ చేద్దాం. మనమందరం కలసి సమాజరూపమైన భగవంతుని సేవించే ప్రయత్నం చేద్దాం. మన మధ్య ఏర్పరుచుకొన్న అవరోధాలు తొలగిపోవాలి. ఆ భగవత్సంతానమైన మనం ఒక కుటుంబంగా భావన చేస్తూ, పరస్పర ప్రేమానురాగాలతోటి గౌరవాదరణ తోటి

తోటివారికి తోడ్పడుతూ జీవితాన్ని సాగించేట్టు అడుగు ముందుకు కదుపుదాం.

గీతాజ్యోతి ని మనతో శాశ్వతమైన కరదీపిక చేసుకుందాం! భగవత్ అనుగ్రహాన్ని మనం పొందుతూ మిగతా ప్రాణి కోటితో ఈ భూమ్మీద మరో పదికాలాల పాటు మనుగడ సాగించగలిగే ఈ ఉద్యమంలో మనం ఒక అడుగు కలిసి నడుద్దాం.

రండి ! అందుకోండి! ఆదరించండి!

మనవారందరితో ఆచరింప చేయండి

శ్రీకృష్ణభగవానుడు మనకు తోడుండుగాక! ఆచార్యుల అనుగ్రహం మనకందరికీ ఉండుగాక!